క్లుప్తంగా

బీసీ కులగణన చేర్చాలి

గద్వాల : దేశ వ్యాప్తంగా 2025 జనవరిలో చేపటనున్న జనాభా లెక్కల సేకరణలో అన్ని అంశాలతో బీసీ కులాలకు సంబంధించిన జనాభా వారి కులగణన తప్పనిసరిగా చేర్చాలని బహుజన రాజ్యసమితి అధ్యక్షుడు వాల్మీకి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్మృతివనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా కులగణన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన రాజ్యమతి నాయకులు వినోద్‌కుమార్, డాక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మల్లేష్‌గౌడ్

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడిగా గువ్వలదిన్నె గ్రామానికి చెందిన మల్లేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. రెండు నెలల క్రితం నిర్వహించిన ఓటింగ్ ఫలితాల్లో ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మండల యూత్ సభ్యులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని పేర్కొన్నారు.

పొలం తగాదాలో కేసు నమోదు

రాజోళి: సుబాబుల్ పంట కోత విషయంలో అడ్డు వస్తున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్. జగదీష్ తెలిపారు. మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో వెంకటేశ్వర్‌రావ్ సుబాబుల్ పంట సాగు చేశాడు. ఈ నేపథ్యంలో పంట నరికేందుకు ఆదివారం పనులు మొదలు పెడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన బోయ పరుశరాముడు, చిన్న రంగన్న మరికొందరు అడ్డుకోగా వారిపై కంతంనేని గోపాల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పెద్ద ధన్వాడ గ్రామంలోని తుంగభద్ర నదిలో ఆదివారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తీసేందుకు వెళ్లిన తంబలి పెద్దనర్సింహులుకు చెందిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ తెలుగు మధుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వీపనగండ్ల: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాణి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా కొద్దిపాటి డబ్బులు చెల్లిస్తే లక్షల్లో లోన్లు మంజూరు చేస్తామని సైబర్ నేరగాళ్లు ప్రజలకు వల విసురుతున్నారన్నారు. వీటితో పాటు యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువుల్లో రాణించాలని విజ్ఞప్తి చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షెడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



అమరచింత: మండలంలోని శ్రీఅడవి ఆంజనేయ ఆలయ సమీపంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నూతన రేకుల షెడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తమ సొంత స్థలాన్ని దానంగా ఇవ్వగా గోవిందు, మనెమ్మలు రేకుల షెడ్‌కు నిర్మాణానికి విరాళం అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం. నాగరాజ్‌గౌడ్ స్వామి భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

అమరచింత: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. సృష్టిని నిర్మించిన ఆ పరమాత్ముని ప్రబోదనలు ప్రతి ఒక్కరూ విని భక్తి భావంతో ఉండాలన్నారు. ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మ జ్ఞానానికి గుర్తన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ, పెబ్బేరు కమిటీ, మద్దిగట్ల కమిటీ అధ్యక్షులు, సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి ,రాఘవేంద్ర, నరేందర్, పురుషోత్తం శ్రేష్టి, రామచంద్రయ్య, బాలకృష్ణ, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రహ'దారి' తప్పుతున్నారు..

- సూచిక బోర్డుల ఏర్పాటుకు నోచుకోని రహదారులు
- దారి తప్పుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



మెలికలు తిరిగిన సూచిక బోర్డు



సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

అయిజ: ప్రాంతాల సరిహద్దులను సూచించేందుకు, మధ్య దూరం తెలియజేసేందుకు సంబంధిత అధికారులు ప్రధాన రోడ్లకు ఇరువైపుల సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. దీంతో వాహన దారులు తమ గమ్య స్థానాలకు చేరుకునే వారు. కానీ అయిజ మండలంలో ఆర్అండ్‌బీ అధికారులకు మాత్రం ప్రయాణికులు సూచిక బోర్డుల లేకపోవడం వలన పడే కష్టాల గురించి ఏ మాత్రం పట్టడం లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ ప్రాంతానికి ఎటు వెళ్లాలో తెలియక, ఏ రోడ్డుపై వెళ్తే ఎన్ని కి.మీ. దూరం ఉంటుందో అంచనా లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

తికమక పెడుతున్న ప్రధాన కూడలి..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లేందుకు మండల కేంద్రంలో మూడు రోడ్ల ప్రధాన రహదారులకు సంబంధించిన కూడలి ఉంది. అధికారులు కనీసం అక్కడ కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయ లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నడుమ పులికల్– నాగలదిన్నెల మధ్య తుంగభద్రా నదిపై వంతెన నిర్మించారు. మండల కేంద్రంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో నాగలదిన్నె బ్రిడ్జికి చేరుకోవాల్సిన ప్రయాణికులు కర్నూలు రోడ్డుపై వెళ్లిపోతున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన ప్రయాణికులు కర్నాటక రాష్ట్రానికి చేరుకునేందుకు బదులుగా మండల కేంద్రంలో కర్నూలు రోడ్డుపై వెళ్లి తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్తున్నారు. అదే విధంగా కర్నాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు గద్వాలకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సమయానికి గమ్యం చేరుకోలేక, ఇంధనం వృథా అవుతుందని, మరికొన్ని రోడ్లపైనే వాహనాలు ఆపి చిరునామా చెప్పే వారే లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

సరైన సమయంలో చేరలేకపోతున్నాం..



రోడ్ల పక్కన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురైన వారు 108కు ఫోన్ చేసి సరైన చిరునామ చెప్పలేకపోతున్నారు. దీంతో అంబులెన్స్ సంఘటనా స్థలానికి సరైన సమయంలో చేరుకోలేకపోతుంది. – శ్రీధర్, 108 వాహన సిబ్బంది

ఇంధనం వృథా..



కర్నూలు, రాయచూరు రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణికులు వెళ్లాల్సిన గమ్యస్థానా నికి వెళ్లకుండా మరెక్కడికో వెళ్తున్నారు. దీంతో ఇంధనం వృథాగా ఖర్చువుతుంది. – మహేష్, ఈడుగోనిపల్లి

నిధులు మంజూరు కాలేదు..

సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు కాలేదు. బోర్డులు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మా దృష్టికి వచ్చింది. రోడ్లకు మరమత్తులు నిర్వహించే సమయంలో బోర్డులు ఏర్పాటు చేస్తాం. – కిరణ్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ

పన్ను వసూలేనా.. పనులు ఎక్కడ?



ఉండవెల్లిలో మురుగు కాల్వలో పెరిగిన గడ్డి

ఉండవెల్లి: మండల కేంద్రంలో పన్నులు వసూలు చేయడానికి మాత్రమే అధికారులు ఉన్నారా.. లేక పనులు చేయడానికి కాదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి స్తంభాలకు, రహదారి పొడవున లైట్లు లేక చీకట్లు అలుముకుంటున్నాయని, కాలువల్లో గడ్డి పెరిగిన స్థలాన్ని చూసిన పట్టింపులేదని, రోడ్లు గుంతలమయమయ్యాయని పేర్కొన్నారు. ఉపాధి కోసం నిధులు కేటాయించిన వాటిని ఉపయోగించే పరిస్థితి లేదన్నారు. ఎంపీడీఓ తిరుపతన్న వాటిని పరిశీలించి నిధులు లేవని ఏకధాటిగా తెలుపుతున్నారని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు గ్రామంలోని సమస్యలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా నిధులు రాలేదంటున్నారన్నారు. విధి నిర్వహణలో సమయపాలనే పాటించని అధికారులు పాలన ఎలా చేస్తారని గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్న పంచాయతీ కార్యదర్శి పన్నుల వసూలుకే పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

గద్వాల : వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలల్లో మౌలిక వసతులు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని గురుకులల బాట జిల్లా ఇన్‌చార్జి కుర్వ పల్లయ్య మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ విజయ్‌కుమార్, అతిఖుర్ రహ్మాన్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అదేశాల మేరకు గురుకులాల బాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని గురుకులాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మౌలిక వసతుల కరువు, నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కొల్లాపూర్ రూరల్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని నందిని ఎంపికైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్– 14 కబడ్డీ పోటీలలో పాల్గొంటుందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికే ఆరోపణలు

- బీఆర్ఎస్ నేతలవి దింపుడు కళ్లం ఆశలు
- నేను సహకరించకపోతే వనపర్తి జిల్లా అయ్యేదా?
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వనపర్తి పురపాలికలో సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు

వనపర్తిటౌన్: స్థానిక సంస్థల్లో లబ్ధి పొందేందుకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తనతో పాటు ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని.. ప్రజలు ఆయనను నమ్మకనే అసెంబ్లీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దింపుడు కల్లం ఆశలతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందన్నారు. వనపర్తి జిల్లా కోసం నిరంజన్‌రెడ్డి ఎన్నో పర్యాయాలు తనను బతిమాలాడారని, కొల్లాపూర్‌లోని మూడు మండలాలు కలపకపోతే జిల్లా అయ్యేదా అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను నిలదీసే అవకాశం కాంగ్రెస్ ఇస్తోందని, దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ కవిత జైలులో ఉన్నప్పుడే తెలంగాణలో చాలా పనులు జరిగాయని.. ఇప్పుడు బయటకొచ్చి ఏం తెలియకుండా మాట్లాడటం సరికాదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రాక్టికల్‌గా చూసి చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పనిచేసిన ఎమ్మెల్యేల కంటే 20 రెట్లు అధికంగా అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.136 కోట్ల అభివృద్ధి పనులకు..

కొత్తకోట రూరల్/వనపర్తి టౌన్: జిల్లాలో రూ.136 కోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పెద్దమందడి మండలం మోజర్ల వద్ద రూ.6 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి, వనపర్తికి తాగునీరు అందించేందుకు రూ.1.76 కోట్లతో నిర్మించే 5 లక్షల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 5, 18, 19, 20, 21 వార్డుల్లో రూ.50 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణానికి ఇందిరాకాలనీలో శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకం కింద రూ.70 కోట్లతో వనపర్తి తాగునీటి సరఫరా పనులకు బుడగజంగాలకాలనీలో శంకుస్థాపన చేశారు. వైద్య కళాశాల పక్కన రూ.4 కోట్లతో నిర్మించిన మహిళా ఉద్యోగుల వసతిగృహ భవనాన్ని ప్రారంభించారు. అక్కడే రూ.5 కోట్లతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.1.10 కోట్లతో గ్రంథాలయం పైఅంతస్తు భవన నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఆర్అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజినీర్ దేశ్యానాయక్, పంచాయతీరాజ్ ఇంజినీర్ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహేష్, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

చిన్నన్న గైర్హాజరు..

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం జిల్లాలో జరిగిన మంత్రి జూపల్లి పర్యటనలో కనిపించలేదు. సొంత నియోజవర్గంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారెడ్డి పాల్గొనకపోవడంపై భిన్నవాదనలు వినిపించాయి.

సొంత అవసరాలకే పార్టీ మార్పు



అయిజ రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల : ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సొంత అవసరాలకు, కాంట్రాక్ట్‌లకు, పాత బిల్లుల కోసం పార్టీ మారారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు ఆరోపించారు. గుంతలమయంగా మారిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని అయిజకు వెళ్లే రోడ్డులో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు తేలేదన్నారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారిన ఎమ్మెల్యే అధ్వానంగా తయారైనా రోడ్లు, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు ప్రాజెక్టు ఇవ్వలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు మక్బూల్, బీచుపల్లి, రవి, నర్సింహ్మా, గోవిందు, తిరుమలేష్, రాజు పాల్గొన్నారు.

హైటెక్ పద్ధతిలో వ్యవసాయం



గోకులపాడులో కందిపంటకు డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న రైతులు

మానవపాడు: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని కొందరు ఉపాధి పొందుతున్నారు. రైతులకు నేస్తాలుగా మారుతూ.. ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆదివారం మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన పరుశరాముడు రూ. 4.30 లక్షల డ్రోన్‌తో పంట పొల్లాల్లో మందు

డ్రోన్లతో మందు పిచికారీ



పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని రైతులకు నేస్తాలుగా కొత్త ఆలోచనలతో యువకులు మారుతున్నారు. మిరప, కంది పొలాల్లో డ్రోన్లతో మందు పిచికారి చేస్తూ రైతులకు నేస్తాలుగా మారుతున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప స్వామి 18 మెట్లను అలంకరిస్తున్న స్వాములు

అలంపూర్ రూరల్: సర్వభూత దయాపరా రక్ష రక్ష మహభాహో అంటు అయ్యప్ప స్వాములు చేసిన శ్లోకాలు, శరణగోషతో పట్టణంలోని వడ్లచారి వీధి పులకరించింది. వడ్లచారి వీధిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక, కుమారస్వామి, లక్ష్మీదేవి, అయ్యప్ప స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి 18 సోపనాలపై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వాములు ఆనంద్, ఎల్లయ్య, లక్ష్మీనారయణ, శ్యామ్, రాము, హరినాథ్, విజయ్ కృష్ణ, భాస్కర్ గౌడ్, రఘు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొంకలలో అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2006–07 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఒకే చోట చేరి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నరేంద్ర, శ్యాంసుందర్, లక్ష్మీకుమార్, భాస్కర్, షేక్ అస్లాం షరీఫ్, ప్రసన్నకుమారిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం అన్వర్‌హక్, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టండి సారూ..



మల్దకల్- ఎల్కూరు గ్రామాల మధ్యన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మల్దకల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బీటీ రహదారులపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు. మల్దకల్, ఎల్కూరు గ్రామాల మధ్యన ఉన్న బీటీ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బిజ్వారం నుంచి సంగాల వరకు ఉన్న బీటీ రహదారిపై ఏర్పడిన గుంతల వలన వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారులపై ప్రతి నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నా, ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మల్దకల్‌లో కూలీలను తరలిస్తున్న బొలేరోవాహనం

పరిమితికి మించి ప్రయాణం

గద్వాల(మల్దకల్) : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు గూడ్స్ వాహన దారులు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గట్టు, కేటీదొడ్డి, అయిజ మండలాల నుంచి నిత్యం మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు 10నుంచి 30కు పైగా గూడ్స్ వాహనాల్లో కూలీలను చేరవేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 నుంచి 50మంది కూలీలను చేరవేస్తుండడంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా భారీగా ప్రాణ నష్టం జరిగే ప్రమాదముందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు గూడ్స్ వాహన దారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.